

# రమణ భాస్కర

ఆధ్యాత్మిక పక్షపత్రిక

ఎడిటింగ్ : శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

05-7-2001 (14)



## శ్రీ రమణ క్షేత్రం - జిన్నూరు

పశ్చిమ గోదావరి జిల్లా - ఆంధ్రప్రదేశ్

# సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహ భాషణములు

| | | |
|---|---|---|
| 10-07-2001 నుండి<br>26-07-2001 | | సద్గురు శ్రీ నాన్నగారు అరుణాచలం కేంపు |
| 30-07-2001 | మహేంద్రవాడ | సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయప్రాంగణంలో<br>రూట్: మండపేట, రామచంద్రపురం కెనాల్ రోడ్‌లో<br>పెడపర్తి రేవు నుండి ఎడమవైపుకు వయా<br>కుతుకులూరు, పాలమూరు |
| 31-07-2001 | పాలకొల్లు | శ్రీ పెన్మెత్స సత్యనారాయణ రాజు, సూర్యపద్మావతి<br>క్షత్రియ సంక్షేమ పరిషత్ కళ్యాణ మండపం |



ది. 30-06-2001 సాయంత్రం గం. 4-00 లకు

పాలకొల్లునందు

**మాతృక మేక్ సొసైటీ లిమిటెడ్** వారి

ఆన్‌లైన్ బ్యాంకింగ్ సర్వీసెస్‌ను

**సద్గురు శ్రీ నాన్నగారి** సువర్ణ హస్తములతో ప్రారంభించిరి.



ఓం నమోభగవతే శ్రీరమణాయ

# రమణ భాస్కర

సంపుటి : 6 సంచిక : 14 పుష్యం : 42-44 05-07-2001



**RAMANA BHASKARA**

**TELUGU SPIRITUAL FORTNIGHT MAGAZINE**

PAGES : 20

**VOL : 6** **ISSUE : 14**

EDITOR
**P.S. RAMA RAJU**

EDITING
**P.H.V. SATYAVATHI**
(HYMA)

**SUBSCRIPTION**
Yearly : **Rs. 140/-**
Each Copy : **Rs. 10/-**

**ADDRESS**
**RAMANA BHASKARA**
SRI RAMANAKSHETRAM
**JINNURU - 534 265**
W.G.Dt., A.P.

**PUBLISHER**
P.S. RAMARAJU
LAKSHMI MODERN RICE MILL
**ULLAMPARRU - PALAKOL**
☎ 08814 - 24589, 24689

**PRINTER**
SHRIRAM GRAPHICS
**BANK STREET - PALAKOL**
☎ 08814 - 22438, 24278

## ఆధ్యాత్మిక హృదయమే గురువు - మనస్సు దానిలో స్థితి పొందటమే గురుపూజ

దేహాత్మబుద్ధి ఉన్నవారికి శరీరము ఉన్నట్లు తెలుస్తూనే ఉంటుంది. శరీరస్పృహ శరీరం అంతా వ్యాపించి ఉన్నప్పటికీ, శరీరం అంతా మనంకాదు. ఏవో కారణాలవల్ల మన అంగాలు, ఇంద్రియాలు లేనప్పటికి, మనం ఉన్నట్టు మనకు తెలుస్తూనే ఉంటుంది. అందుచేత 'నేను ఉన్నాను' అనే చైతన్యానికి, మనలోనే ఒక కేంద్రం తప్పక ఉండాలి. దేహబుద్ధి కలవాడు 'నేను' అన్నాడంటే, 'నేను దేహమును' అని, అతని ఉద్దేశము, 'నేను దేహమును' అనే తలంపు, ఎక్కడపుట్టి, దేనిలోలయ మౌతుందో అదే ఆత్మస్థానమైన ఆధ్యాత్మిక హృదయము. తలంపు హృదయమునుండి పుట్టి, దానిలో లయిస్తుంది కనుక, హృదయము తలంపుకు ఒక విషయముకాదు (Spiritual heart is not an object for thought to see). అది మనకు కేంద్రమా, కాదా అనే అనుమానం ఎప్పుడు వస్తుందంటే, మనం భౌతికమైనదానితో (Physical) స్థూలమైన దానితో (Tangible) తాదాత్మ్యం పొందినప్పడు.

ఈ సంచికలో.............

**సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు**

29-03-2001 రాజోలు ........ 3
17-06-2001 భగ్గేశ్వరం ........ 9
24-06-2001 జిన్నూరు ........ 15

ఈ కేంద్రంలేని చోటులేదు. కాని దేహాత్మబుద్ధి కలవారికి, సాపేక్షజ్ఞానంలో (Relative Knowledge) కూరుకుపోయిన వారికి అర్థమవటం కోసం, శరీరంలో ఈ కేంద్రం వెలుగొందే చోటు, ఛాతి కుడిభాగాన (Right side of Chest) ఉన్నదని సూచించవలసివస్తున్నది. ధ్యానవాహిని ఈ కేంద్రంలోనే జరుగుతుంది. ప్రపంచము, శరీరము దీనిలోనే స్థితిపొంది ఉంటాయి. దేహబుద్ధి ఎక్కువగా ఉన్నవారికి ఆధ్యాత్మిక హృదయం ఒక సిద్ధాంతంలా అనిపిస్తుంది.

ఆధ్యాత్మిక హృదయము ఓజస్సుకు (Pure energy) స్థానము, జీవశక్తి (Life Current) దీని నుండే బయలుదేరుతుంది. సర్వము దానినుండే ఉద్భవించి, దానిలోనే లయిస్తాయి. అన్నిటికి ఆధారము (Support) అదే గనుక దానిని హృదయము (ఉల్లము) అంటారు. ఇది తలంపు ఏదియు లేక తలంపులకు మూలమైన సద్వస్తువు, ఆధ్యాత్మిక హృదయము. శరీరము ఉన్నప్పడు, శరీరము లేనప్పడుకూడా స్ఫురణగా, స్పందన రూపంలో ఎల్లప్పడూ పనిచేస్తూ ఉంటుంది. ఆధ్యాత్మిక హృదయము శరీరములో ఒకభాగంకాదు. శరీరము మరణించినప్పటికి 'నేను ఉన్నాను' అనే స్ఫురణకు తెంపు (Break) ఉండదు. ఇది సున్నితమైన మనస్సు (Sensitive Mind) కలవారికి మాత్రమే తెలుస్తుంది.

ఆధ్యాత్మిక హృదయము సహజంగా ఎలా ఉండాలో అలా ఉంటుంది. దాని గురించి తప్పడు అభిప్రాయాలు (False Notions) ఏర్పరుచుకొనే కొద్దీ, దాని దర్శనం మనకు దూరమవుతుంది. అందుచేత ఆధ్యాత్మిక హృదయం గురించి తలంచుట మానివేసి, దానిలో స్థితి పొందుటకు ప్రయత్నించాలి. దేహంతో తాదాత్మ్యంవల్ల, ఆధ్యాత్మిక హృదయంమీద మనం పట్టు (దృష్టి) కోల్పోయాం. ఉపాధి చలనములను మనమీద ఆరోపించుకున్న మూలాన మనకు ఈ దుర్గతి పట్టినది.

అందుచేత అన్నిటికీ మూలమైన స్వయంజ్యోతి స్వరూపమగు ఆధ్యాత్మిక హృదయమే మన గురువు. మనస్సు దానిలో స్థితి పొందటమే నిజమైన భక్తి, జ్ఞానం, యోగం. ఇదే భావశూన్య సద్భావ సుస్థితి. మనస్సు ఆధ్యాత్మిక హృదయంలో స్థితి పొందినప్పడు నిజమైన గురుపూజ ప్రతిక్షణం జరుగుతూ ఉంటుంది.

- Dr. P.V.S. సూర్యనారాయణ రాజు

# మనలో ఉన్న అజ్ఞానం అనే చీకటిని తొలగించేవాడే గురువు

సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 29-3-2001, రాజోలు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా :

ఈ రోజు షిర్డీబాబా దేవాలయ ప్రథమ వార్షికోత్సవ సందర్భంగా మనమంతా ఈ జ్ఞానయజ్ఞంలో పాల్గొంటున్నాము. ప్రఖ్యాతి చెందిన మహాత్ములలో షిర్డిబాబా ఒకరు. మహాత్ములు అందరూ వారి వారి స్వభావాన్నిబట్టి మాట్లాడతారు. వారి చేష్టలుకూడా ఒకేరకంగా ఉండవు. మహాత్ములు అందరూ సమాజమునకు సారము వంటివారు. సమాజ హితవు కోరి పనిచేస్తారు. మహాత్ముల దేహం ప్రారబ్ధమునకు లోబడి వుండినా, వారు మాత్రం ప్రారబ్ధమునకు అతీతులే. వివాహము, మరణమే కాకుండా దేహానికి సంబంధించినంతవరకూ ప్రతి సంఘటనా ప్రారబ్ధమును అనుసరించే జరుగుతాయని మహాత్ములు అంటారు. పూర్వకాలంలో సంసారమును పూర్తిగా త్యజించి సన్యాసులై కొంతమంది తరించారు, మరికొంతమంది సంసారంలో ఉండి తరించారు. ఏ ఆశ్రమంలో ఉన్నా పవిత్రులు కానివారు తరించలేరు. పరమపవిత్రులు కానివారికి సత్యం వారి హృదయంలో అత్యంత సమీపంలో ఉన్నప్పటికీ గోచరం కాదు. ఉన్నది సత్యమే, మిగిలినదంతా మనోకల్పితము. మనోకల్పితములోనుండి విడుదల పొందనివాడికి దుఃఖము నశించదు, కాలం వృథా అవుతుంది, సద్వస్తువుకు దూరం అవుతాడు. తెరమీద ఉన్న బొమ్మలకు తెర ఏవిధంగా ఆధారమో అదేవిధంగా లోకంలో ఉన్న నామరూపములకు బ్రహ్మమే ఆధారము. తెరమీద జరిగే సంఘటనలు తెరకు అంటవు. అలాగే లోకంలో జరిగే సంఘటనలు బ్రహ్మంనకు అంటవు. జ్ఞాని అంటే ఒకవ్యక్తి కాదు బ్రహ్మమే. లాభనష్టములకు, నిందాస్తుతులకు, హెచ్చుతగ్గులకు వ్యక్తి చలిస్తాడు, కాని బ్రహ్మం చలించదు. చలించేది మాయ, చలించనిది బ్రహ్మము.

షిర్డీబాబాకు కులమత బేధములు లేవు, ప్రాంతీయ తత్వం లేదు. భక్తులకు ఎంతో సన్నిహితంగా ఉండేవారు. వారు కష్టములలో ఉన్నప్పడు ఆదరించేవారు. ఎన్నో మహిమలను ప్రదర్శించేవారు. వేంకటేశ్వరస్వామికి ఎంతమంది భక్తులు ఉన్నారో బాబాకు కూడా అంతేమంది భక్తులు ఉన్నారు. బాబా అతినిరాడంబరుడు, అనుష్టాన వేదాంతం బోధించేవారు, భక్తులకు త్యాగబుద్ధిని, సహనబుద్ధిని నేర్పారు. సత్‌పరుషులతో సహవాసం చేయమని ప్రోత్సహించేవారు, బేధబుద్ధిని ఖండించేవారు. మనిషికి, మనిషికి మధ్య బేధాలు పెంచి కలహాలు సృష్టించే కలహప్రియులకు దూరంగా ఉండమని ఉపదేశించారు. దేహప్రారబ్ధమును ఇష్టముగా అనుభవిస్తే మనోమాలిన్యం తగ్గుతుందని చెప్పేవారు. వాగాడంబరము పనికిరాదని బోధించేవారు. గురువుయొక్క పాదములను ఆశ్రయించుటద్వారా శాశ్వతశాంతిని

పొందవచ్చని అనేవారు. మహాపురాణమైన భాగవతమును అధ్యయనము చేయమని సలహా ఇచ్చేవారు. ఇతరులలో ఉన్న దోషములు చూస్తూఉంటే నీకు మలదోషం పెరుగుతుందని చెప్పేవారు. నీ బుద్ధిలో ఉన్న దోషములను వెతికి బయటకు లాగి వాటిని తగలబెట్టమనేవారు. దోషములనుండి విడుదల పొందుటకు నీ ప్రయత్నము నువ్వు చేస్తే గురువు అనుగ్రహము రానే వస్తుంది. గురువు మాటలయందు గౌరవము లేనివాడికి గురువు పాదములయందు కూడా భక్తి కలుగదు. వివేకవంతముగా జీవించాలనుకోవటం వేరు, జీవించటం వేరు. అంతఃకరణములో దోషములు ఉన్నప్పుడు వివేకవంతముగా జీవించటం సాధ్యంకాదు. కనీసము మరణించే లోపులోనైనా వివేకవంతముగా జీవించగలిగితే విషాదమునకు దూరం అవుతాడు. కొంతమంది భక్తులు ముక్తికంటే భక్తికే ప్రాధాన్యము ఇస్తారు, భక్తేచాలు అంటారు. వారికి దైవముపట్ల మినహాయింపులు లేని ప్రేమ ఉంటుంది. దేహంఉన్నా, లేకపోయినా, ప్రపంచం కనిపించినా, కనిపించకపోయినా వారు ఈశ్వరుని పాదాలు అంటిపెట్టుకుని ఉంటారు. దైవము కల్పించిన లోకాలకంటే వారికి దైవమే ముఖ్యము. దైవమును ప్రేమిస్తారుకాని ఆయననుండి ఏమి వాంఛించరు. దైవము గురించి పరస్పరము మాట్లాడుకోవటానికి సిగ్గుపడరు. వారికి దైవచింతనేకాని లోకచింతన ఉండదు. లోకచింతన ప్రాణశక్తిని నశింపచేస్తుంది, బుద్ధిని నిర్వీర్యం చేస్తుంది, శరీరాన్ని శిథిలం చేస్తుంది. దైవచింతన జీవుడిని పరమపవిత్రుడినిచేసి, దేహం ఉండగానే దేహంతో ఇసుమంతయూ సంబంధంలేని పరమస్థితికి చేరుస్తుంది.

యజ్ఞ, దాన, తపస్సులను త్యజించకూడదని షిర్డిబాబా అనేవారు. యజ్ఞభావంతో పనిచేస్తే స్వార్థం తగ్గుతుంది. స్వార్థం ఉన్నవాడికి పరమార్థం అందదు. దానంవల్ల దోషాలు తగ్గుతాయి. చేసిన దానం మర్చిపోతే కర్తృత్వబుద్ధి పెరగటానికి అవకాశము ఉండదు. కర్తృత్వం నశించకుండా శాంతి కలగదు. ఇతరులకు నువ్వు ఇచ్చేది తిరిగి నీకేవస్తుంది అని తెలిస్తే ఇతరులకు ఇవ్వకుండా ఎలా ఉండగలవు? అని భగవాన్ శ్రీ రమణ మహర్షి అనేవారు. నీచబుద్ధిని విడిచిపెట్టి సద్బుద్ధిని సంపాదించాలంటే తపస్సు లేకుండా సాధ్యముకాదు. తపస్సు అంటే మనస్సును ఎండింపచేయటము. తపస్సు లేకుండా మనోనిగ్రహము, ఇంద్రియనిగ్రహము సాధ్యముకాదు. పునర్జన్మ కారణములు మనస్సులో ఉంటాయి. వాటిని తొలగించే శక్తి తపస్సుకు మాత్రమే సాధ్యము, తాను కానిదానినుండి తనను విడుదలచేసి, తాను ఏదిగా ఉన్నాడో అందులో స్థిరత్వమును కల్గించేది మాత్రమే తపస్సు. తపస్వియొక్క మనోదేహములు తేజోవంతముగా ఉంటాయి. తపస్విమనకు పూజార్హుడు. ఆయనను సేవించటం వలనపవిత్రులమౌతాము. అలవాట్ల యొక్క వేగమునుండి విడుదల చేసేది తపస్సు మాత్రమే.

నామరూపములు కల్పితములు. అన్ని నామరూపములలో ఈశ్వరుడు అంతర్యామిగా

ఉన్నాడు. అంతర్యామిగా ఉన్న ఈశ్వరుడిని గౌరవించటం, ఆరాధించటం నేర్చుకుంటే రూపదృష్టి, నామదృష్టి పల్చబడతాయి. మనలను ఈ లోకానికి బంధించి జననమరణ ప్రవాహమునకు గురిచేసేది రూపాన్ని, నామాన్ని అంటిపెట్టుకుని ఉన్న కర్తృత్వబుద్ధి మాత్రమే. మనం నామరూపములద్వారా ఈశ్వరుడినే పూజించాలి. ఈశ్వరభావన పెంచుకుంటే లోకానికి సంబంధించిన గౌరవాలు, అగౌరవాలను అతిక్రమిస్తాము. ఇతరులు మనలను గౌరవించటంవల్ల మనకువచ్చే లాభం ఏమీలేదు, అగౌరవపరచటం వలన మనకు వచ్చే నష్టం ఏమీలేదు. ఇది అర్థం అయితే మనస్సుకు నెమ్మది వస్తుంది, బుద్ధి సూక్ష్మత పెరుగుతుంది. అంతఃకరణమునకు మలినము అంటదు, శిరస్సులో ఉన్న భారము తగ్గుతుంది, ఆత్మస్మృతి కలుగుతుంది. మనం ఆత్మగా ఉన్నప్పటికీ దీర్ఘకాలంనుండి ఆ విషయమును మరచిపోయాము. ఆత్మగా ఉండటానికి ఎవరు మనకు సహకరిస్తారో వారే మనకు ఆచార్యులు. బైట చీకటిని సూర్యుడు తొలగిస్తాడు. మనలోపల ఉన్న అజ్ఞానం అనే చీకటిని తొలగించేవాడే ఆచార్యుడు. అందుకే భారతీయులు ఆచార్యులను దైవముతో సమానముగా ఆరాధిస్తారు. ఆచార్యుడి అనుగ్రహం వలన మనకు సమానబుద్ధి కలుగుతుంది. మనలను అదృష్టము వెంటాడుతూ ఉన్నా అది నిత్యముగా ఉండదు, దురదృష్టము వెంటాడుతూ ఉన్నా అదికూడా నిత్యముగా ఉండదు. నిత్యముకానిది సత్యము కాదు. సత్యము కానిదానిని వైరాగ్యము లేనివాడు విడిచిపెట్టలేడు. మానవ మానసమును పతనం చేయుటకు లోకములో ఎన్నో ఆకర్షణలు ఉన్నవి. అభ్యాస, వైరాగ్యములు లేనివాడు ఈ ఆకర్షణలనుండి విడుదల పొందలేడు, గమ్యాన్ని మరచిపోతాడు.

భయాన్ని త్యజిస్తే మానసిక ఆరోగ్యము కలుగుతుంది. తలంపు లేకుండా భయం ఉండదు. భయంతో మనం ఊహించుకునే విషయాలు ఏమి జరగవు. భయంకూడా కల్పితమే. భయరహితమైన స్థితికి మరొకపేరు మోక్షము. అభయస్థితిలోనే ఆనందము ఉన్నది. దేహము నేను అనే మొదటతలంపుకే భయము కలుగుతుంది. ఈ నేనును ఈశ్వరుడికి సమర్పించగలిగితే భయం ఉదయించదు. ఈశ్వరుడికి సమర్పించిన నేనును తిరిగి తీసుకోకూడదని అరుణాచలమహర్షి అన్నారు. భయం అనేక అనర్థములకు కారణము. భయం వలన మెదడు సరిగా పనిచేయదు, జ్ఞాపకశక్తి తగ్గుతుంది. టాగూర్ తన గీతాంజలిలో భయములేని స్థితికి తనను మేల్కొలపమని ఈశ్వరుడిని ప్రార్థించారు. భయంవల్ల మనస్సుకు సమతూకం తగ్గుతుంది. సమతూకం తగ్గిన మనస్సు సంతోషాన్ని తీసుకుంటుంది కాని బాధను భరించలేదు. అట్టివారు నిజమైన భక్తులుకాదు. ఆత్మయే చైతన్యము, ఆ చైతన్యానుభవము ఒక్కటే నిజం. మతాలు, వ్యక్తులు, భయాలు, కోపాలు, తాపాలు ఇవన్నీ కేవలము మనోకల్పితములే. గాఢనిద్రలోనే మనం నిజానికి దగ్గరగా ఉన్నాము. అక్కడ

తలంపులు లేవు. అందువలననే భయాలుకూడా లేవు. భయకారణము ఉన్నప్పటికీ భయం లేకుండా ఉండాలి, అదే సహజస్థితి.

లోకంకూడా స్వప్నంలాంటిదే అందువలన మన దేహాలుకూడా స్వప్నదేహాలే. లోకం స్వప్నం అయినప్పటికీ మనకు నిజంలా కనిపించటానికి కారణము అజ్ఞానము. అజ్ఞానంలోని భాగాలే జనన మరణములు. మరణం లేకుండా జన్మ ఉండదు. నిజంకాని ప్రపంచం మనకు నిజంలా కనిపిస్తున్నది కాబట్టి దానిని తిరస్కరించటం నేర్చుకోవాలి. అది కూడా సాధనలో ఒక భాగమే. లోకంలో మన జీవన వ్యవహారం లోకాతీతస్థితికి తీసుకువెళ్ళుటకు సహకరించాలి. అమృతానుభవము పొందినవాడికి లోకం తనలోనే ఐక్యమయిపోతుంది. అట్టివాడికి వినటానికికాని, చూడటానికికాని, తెలుసుకోవటానికికాని ఏమీ ఉండదు, అంతా తానై ఉంటాడు. సాధనచేసి సిద్ధముగా ఉన్న వస్తువును తెలుసుకున్నవాడే సిద్ధుడు. శుద్ధుడు కానివాడు సిద్ధుడు కాలేడు. ఆ రోజుకు ఆరోజు పవిత్రతను, ఏకాగ్రతను పెంచుకుంటూ రావాలి. సిద్ధపురుషుడే ఆచార్యుడు. ఆచార్యుడే శిష్యులను అమితంగా ప్రేమించి బోధిస్తాడు, నిరభిమానాన్ని, నిరాడంబరాన్ని, నిరహంకారస్థితిని పొందుటకు సహాయ సహకారములు అందిస్తాడు. వైరాగ్యము లేకుండా జ్ఞానసముపార్జన సాధ్యముకాదు. ఆచార్యుడు పరమవైరాగ్యమును గురించి శిష్యుడికి బోధిస్తాడు. కోపంవల్ల వచ్చే వైరాగ్యము నిజముకాదు, నిజముకానిది నిలబడదు. వైరాగ్యసంపద లేకుండా, హృదయంలో నివాసముగా ఉన్న నారాయణుడు గోచరించడు. మనంకానిదానిని త్యజించటం వైరాగ్యము. మనం వ్యక్తిగా కాకుండా ఆత్మగా ఉండటం జ్ఞానము. ఎంతకాలమైతే మనం కానిదానిని త్యజించలేమో అంతకాలం వ్యక్తిగానే ఉంటాము. జననమరణ ప్రవాహమునుండి ఒడ్డుకు రాలేము. వ్యక్తి, వ్యక్తిగా ఉన్నంత కాలం మరణానంతర జీవితంలో ప్రయాణం చేస్తాడు. వాడికి యాతనాశరీరము వస్తుంది. వ్యక్తి ఆత్మలేకుండా ఉండడు, అట్టి ఆత్మలో వ్యక్తి ఐక్యమయినప్పుడు రాకపోకలు ఉండవు. పురుషార్థములు నాలుగు. ధర్మ, అర్థ, కామ, మోక్షములు. వీటిలో మోక్షము ఉత్తమ పురషార్థము అని అంటారు. కొంతమంది భక్తులు మాకు భక్తి చాలు మోక్షముతో పనిలేదు అని అంటారు. భక్తిగలవారికి ఒక్కడే పురుషుడు వాడే నారాయణుడు. వారికి గోచరించేది నారాయణుడే కాని ప్రకృతికాదు. ప్రకృతిని అతిక్రమించిన తర్వాత అందరూ సమానులే. ఒకసారి కృష్ణభక్తురాలైన మీరాభాయి కృష్ణుడు విహరించిన బృందావనం వెళ్ళింది. అక్కడ ఎంతో కీర్తిపొందిన ఒక సన్యాసి ఉండేవాడు. ఆయన ఆజన్మ బ్రహ్మచారి. స్త్రీలు వండిన వంట తినడు, వారిని చూడడు. అట్టి సన్యాసిని దర్శించుటకు వారి ఆశ్రమమునకు మీరాభాయి వెళ్ళినది. నేను స్త్రీలను చూడనని ఆ సన్యాసి ఒక శిష్యునిద్వారా మీరాభాయికి తెలియపరచినాడు. అప్పుడు మీరాభాయి అంటుంది నేను ఇంతవరకూ పురుషుడు అంటే

ఒక్కడే, వాడే కృష్ణుడు అనుకుంటున్నాను. ఇంకో పురుషుడు ఉన్నాడని నాకు తెలియదు అని మీ గురువుగారితో చెప్ప అని మీరాభాయి ఆ సన్యాసి శిష్యుడితో చెప్పింది. ఆ శిష్యుడు లోపలకు వెళ్ళి ఈ వర్తమానము గురువుగారికి తెలియపరచినాడు. మీరాభాయి ఆధ్యాత్మిక అంతస్తుకి ఆ సన్యాసి ఆశ్చర్యపోయినాడు. అతనికి ఆత్మవైపు కళ్ళు తెరువబడ్డాయి. చూచే శక్తి లేనప్పడు నేత్రములు ఉన్నా నేత్రములు లేనివారితో సమానము. అప్పడు మీరాభాయిని ఆశ్రమంలోనికి ఆహ్వానించారు. లింగబేధము శరీరానికి మాత్రమేనని ఆత్మకులేదని, ఆత్మే పురుషుడని మీరాభాయిద్వారా ఆ సన్యాసి గ్రహించాడు. పాపబుద్ధి ఉన్నవాడికి ఇతరులలో ఉన్న దోషము కనిపిస్తుంది, పుణ్యబుద్ధి ఉన్నవాడికి ఇతరులలో ఉన్న గుణం కనిపిస్తుంది. గుణదోషములు ప్రకృతికి సంబంధించినవే. పురుషుడిలో గుణదోషములు లేవు. అట్టి పురుషుడు గురించే మీరాభాయి మాట్లాడినది.

మాయ గుణాల రూపంలో ఉంటుంది. గుణాలవల్ల వికారాలు వస్తాయి. ఈశ్వరుడి పాదాలను ఆశ్రయించి, ఆయన నామాన్ని భజించి, ఆయన రూపాన్ని ఆరాధించి గుణాల్ని అతిక్రమించాలి. గుణాతీతుడినే జ్ఞాని అంటారు. ఈశ్వరస్మరణ గుణాల్ని హరిస్తుంది. కారణం లేకుండా కార్యం ఉండదు. దేహంతో తాదాప్యంపొందే తలంపునుండి అశాంతి వస్తుంది. దేహమే ఆత్మ, దేహమే సత్యం అనుకునే బుద్ధిమీదే గుణాలన్నీ ఆధారపడి ఉన్నాయి. దేహాత్మ బుద్ధి నశించేవరకూ గుణాలుకూడా ఉదయిస్తూనే ఉంటాయి. త్రికరణశుద్ధిగా దేహాత్మ బుద్ధిని తొలగించుకోవటానికి ప్రయత్నము చేసేవాడే నిజమైన సాధకుడు. అగౌరవాన్ని అమృతమువలే, గౌరవాన్ని విషమువలే ఎవడైతే స్వీకరిస్తాడో వాడే నిజమైన సాధకుడు అని రామచంద్రస్వామి ఆంజనేయస్వామితో అన్నారు. ద్వైతపాశం నశించాలి, అప్పడుకాని ఉపనిషత్తులలో చెప్పిన మహావాక్యాలు అనుభవంలోనికి రావు. ఎంతకాలం అయితే దేహాత్మ బుద్ధి నశించదో అంతకాలం దుఃఖాలు, భయాలు, దోషాలు మనచుట్టూ తిరుగుతూ ఉంటాయి. అహంకారరహితముగా జీవించేవాడికి సుఖమే స్వరూపంగా వ్యక్తం అవుతుంది. అట్టి మహానుభావుడు సుఖముకోసం తలంపులమీద, విషయాలమీద ఆధారపడవలసిన పనిలేదు. ఎవరికైతే ఆత్మానుభవం కలిగిందో వారి దేహం ఈ భూమిమీద ఉన్నా లేకపోయినా వారి ప్రభావము లోకంమీద ఉంటూనే ఉంటుంది. సత్యసాక్షాత్కారం పొందినవాడిద్వారా లోకానికి ఎంతోమేలు జరుగుతుందని అరుణాచలమహర్షి అన్నారు. అనేకమంది మహానుభావులు వారి హృదయంలో ఉన్న చైతన్యస్థితిని అందుకోవటానికి హృదయగ్రంథి తెంపుకోవటానికి; రాజ్యాలను, ఈ లోకానికి సంబంధించిన భోగభాగ్యాలను కాకిరెట్టవలే త్యజించారు. హృదయగ్రంథి తాను అయినదానిని కానిదానివలే, తానుకానిదానిని తానే అని స్ఫురింపచేస్తూ ఉంటుంది మానవుడికి. అధికారం వచ్చినా, ధనంపెరిగినా, విద్యను అభ్యసించినా

మానవమానసం విశాలము కాకపోతే ప్రయోజనంలేదు. పెద్ద మనస్సులేనివాడు ఈశ్వరుని కరుణకు పాత్రుడు కాడు. ఏ నేనైతే దేహంపట్ల అభిమానం పెంచుకుంటుందో ఆ నేను సత్యస్వరూపమునకు దూరం అవుతూ ఉంటుంది. దేహగతమైన నేను దేహానికి గాయం తగిలినప్పుడుకంటే తనకు అవమానం వచ్చినప్పుడు ఎక్కువ బాధపడుతుంది. దేహానికి తగిలిన గాయముకంటే మనస్సుకు తగిలిన గాయము ఎక్కువ కాలం ఉంటుంది. కాలప్రవాహములో మనస్సుకు తగిలిన గాయంకూడా తగ్గుతుంది. ఈశ్వరుడు కాలరూపంలో ఉన్నాడు. మానవ ప్రయత్నమునకు పరిష్కారముకాని సమస్యలను కాలం పరిష్కరిస్తుంది. కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలి. పోయిన ధనం తిరిగివచ్చే అవకాశం ఉందికాని, పోయిన కాలం తిరిగిరాదు.

బుద్ధికి నిజంపట్ల పక్షపాతం ఉంటుంది. బుద్ధి నిజాన్ని గ్రహించేవరకూ బుద్ధికి చాపల్యం తప్పదు. పరిశుద్ధమైన బుద్ధి మాత్రమే నిజంమీద అభిమానమును పెంచుకుంటుంది. నిజాన్ని దర్శిస్తే స్వేచ్ఛ, నిజాన్ని దర్శించకపోతే బంధం. ఇతరుల క్షేమంకోసం పనిచేయటం వలన కూడా ఈ బంధం పల్చబడుతుంది. సత్యాన్వేషకుడికి మనోనిగ్రహం సహజంగానే వస్తుంది. నిగ్రహంలో బంధముకూడా తెగిపోతుంది. తెలివైనవారు ఈశ్వరుడిని స్మరించి మనోనిగ్రహం సాధిస్తారు. నియమింపబడిన మనస్సు ఇహపరములను సాధిస్తుంది. ఆత్మవిశ్వాసంతో పనిచేసి నకిలీ నేను రూపంలో ఉన్న మనస్సును నశింపచేయుటకు సర్వశక్తియుక్తులతో ప్రయత్నము చేయాలి అనే సాధన. సాధన లక్ష్యం శాశ్వతశాంతి. ఈశ్వరుని దయవలన మన జీవితకాలం అంతా శాంతిగా నడుస్తుంది. మంచి చేసినవాడికి దుర్గతి లేదని భగవద్గీతలో వాసుదేవస్వామివారు అన్నారు. మంచితనమే జ్ఞానమని గ్రీకు తత్త్వవేత్త సోక్రటీస్ అన్నారు. మంచివాడికి మనస్సు బంగారం అవుతుంది. మరణానంతర జీవితంలో ఈ బంగారమే మనకూడా వస్తుంది. ఎంతోకొంత మంచి లేకుండా మానవుడు ఉండడు. ఆ మంచిని పెంచుకోవడమే సాధన. నిప్పును గాలి పెంచుతుంది, మంచిని సాధన పెంచుతుంది. సాధకుడుకానివాడు సిద్ధుడు కాలేడు. శ్రీకృష్ణుడు యుద్ధంలో ప్రతిరోజూ అందరిని సాగనంపి ఆఖరున తను ఇంటికి వెళ్ళేవాడు. అదేవిధంగా గురువు అందరినీ తరింపచేసి తను వెడతాడు. అక్కడ యుద్ధం అంటే, ఇక్కడ మన సాధనే యుద్ధం. ఈ సాధనలో ఒక్క చిన్న వాసననుకూడా మిగల్చకుండా హృదయంలో లయింపచేసి, అన్ని వాసనలు నశించిపోయాక చివరకు తను స్వరూపంగా వ్యక్త మవుతాడు. అందుచేత గురువుపట్ల మన భక్తి శాంతిగా, స్థిరంగా ఉండాలి. గురువుపట్ల మీకుఉన్న సజీవమైనప్రేమకు ఎంతటి సాధనైనా సాటిరాదు.

# జడాన్ని ఆరాధించినవాడు బద్ధుడవుతాడు, చైతన్యాన్ని ఆరాధించినవాడు ముక్తుడవుతాడు

సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 17-6-2001, భగ్గేశ్వరం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనస్సు ఒక భావంమీద లగ్నం చేయటానికి జపం ఉపయోగపడుతుంది. భౌతిక విద్యకైనా, ఆధ్యాత్మిక విద్యకైనా, ఏకాగ్రత, పవిత్రత అవసరం. మన హృదయంలోని జ్ఞానసంపద అనే పెట్టెను తెరచుకోవటానికి ఏకాగ్రత అనే తాళంచెవి అవసరం. మనం ఎంత సాధనచేసినా పురోగతి లేకపోవటానికి కారణము నమ్రత లేకపోవటమే. పవిత్రతవల్ల నమ్రత వస్తుంది. జపంయొక్క ప్రయోజనం ఏకాగ్రతను, పవిత్రతను సంపాదించిపెడుతుంది. ఈశ్వరస్మరణ ఆపిన వెంటనే అహంకారం వచ్చేస్తుంది. దాని వేగం ఆపుచేయటానికే జపం. జపం చేయటంవల్ల శరీరం, మనస్సు స్వాధీనంలోనికి వస్తాయి. మనస్సుకు ఏకాగ్రత పవిత్రత కలుగుతుంది. ఏకాగ్రత, పవిత్రత ఉంటే అన్నీ సాధ్యమే. సాధనలో మనకు ప్రగతి లేకపోవటానికి కారణము మంచి విషయాలను మర్చిపోతాము. మనలో ఉన్న అహంకారంను, గర్వమును గుర్తుపెట్టుకుంటాము. మనకు ఉండవలసినంత వైరాగ్యము లేదు. ఎదుటవారి చూపులతో మనలను అంచనా వేసుకుని చూసుకోకూడదు, మనకు తగినంత విశ్వాసము లేదు. మన మీద మనం విశ్వాసం కోల్పోకూడదు, తరగని విశ్వాసం ఉన్నవాడికి ఆత్మజ్ఞానం కలుగుతుంది. మీకు మంచిగుణాలు ఉన్నాయి అని ఎవరైనా అంటే వెంటనే మనకు అహంకారం వచ్చేస్తుంది. అది గుణాభిమానం. ధనం, చదువు, అందం, గుణాలు ఇవిఅన్నీ వ్యవహారికము అంటే ఆనాత్మకు సంబంధించిన విషయములు. వీటితో తాదాప్యంవల్ల అహంకారం పెరుగుతుంది. మీరు కాని దానితో తాదాప్యం చెందినంత కాలము మీరు ఏదైతే అవునో ఆ సత్యము మీకు అనుభవములోనికి రాదు. ఇది చాలా చిక్కు సమస్య. ఈ సమస్యవల్ల మనలో ఉన్న అహంకారాన్ని, గర్వాన్ని మరచిపోవటానికి బదులు నిరంతరం జ్ఞాపకము పెట్టుకుంటాము. అందుకే మనము నమ్రతను విడిచిపెట్టకూడదు. విడిచిపెడితే బంతి పల్లానికి జారిపోయినట్లు ఉన్న స్థితి నుంచి జారిపోయి మన స్వరూపానికి దూరం అవుతాము. నమ్రత కలిగినవారి ముఖాలు చూస్తే చాలా ప్రశాంతంగా ఉంటాయి. అటువంటి వారికి వెంటనే నమస్కరించాలనిపిస్తుంది. వాళ్ళకు నమస్కరించటం మనకు పుణ్యప్రదం, కారణం మన మనస్సుకు అంతర్ముఖత్వం వస్తుంది. విద్యవల్ల నేర్చుకునే పాఠాలకన్నా మన జీవితమునేర్పే పాఠాలే ఎక్కువ. విద్యతోపాటు తపస్సు ఉంటే మంచి మనస్సు కలుగుతుంది. అటువంటివారు ఆశీర్వదిస్తే ఎదుటవారికి ఏ కార్యమైనా సఫలం అవుతుంది. ఈ లోకం అశాశ్వతం, దుః

భాలయము, పరిస్థితులు మారుతూ ఉంటాయి. జీవితాంతం నువ్వు సర్దుకుపోతూ ఉండాలి. మారనిది నీ హృదయంలోని ఈశ్వరుడే. నిజంకానిది స్థిరంగా ఉండదు. జీవితంలో సర్దుకుపోయేవాడికి స్థిరత్వము వస్తుంది, సహజస్థితిని అనుభవంలోనికి తెచ్చుకుంటాడు. మనకంటే మంచితనం ఎక్కువ ఉన్నవారితో, మనకంటే చైతన్యస్థాయిలో ఉన్నవారితో సహవాసంచేసి వారికి సేవచేయుటంవల్ల నమ్రత వస్తుంది, అన్నీ మనకే తెలుసు అనుకుంటే మహాత్ములు చెప్పిన హితవాక్యములను మన అహంకారం విననివ్వదు. మహాత్ములపట్ల ప్రేమ, వారి వాక్యాలపట్ల గౌరవం లేనివాడికి భగవంతుడి పాదాలు ఆశ్రయించాలనే బుద్ధికూడా కలుగదు. మన అందరికి స్వామికన్నా, స్వామికిఉన్న సొత్తు కావాలి. మనం జడాన్ని ఆరాధిస్తాముకాని, చైతన్యాన్ని ఆరాధించము. జడాన్ని ఆరాధించినవాడు బద్ధజీవి అవుతాడు. చైతన్యాన్ని ఆరాధించేవాడు నిత్యముక్తుడు అవుతాడు. అర్జునుడు కృష్ణపరమాత్మను కోరుకున్నాడు, దుర్యోధనుడు వేలాదిమంది సైన్యాన్ని కోరుకున్నాడు. ఆనాటినుండి ఈనాటి వరకూ మానవమానసం ఇలాగే ఉంది. బైట తళుకులు, బెళుకులు చూసి మోసపోతారు జీవకోటి అంతా. మానవ మానసానికి ప్రతినిధి దుర్యోధనుడు. భక్తుడు కోరుకునేది చైతన్యంను. భక్తుడు కానివాడికి కావలసింది ప్రకృతి, జడం. చైతన్యాన్ని ముందుపెట్టుకుని జీవించేవాడు ముందుచూపు గలవాడు. జడాన్ని, జీవుడిని ముందుపెట్టుకుని జీవించేవాడు ముందుచూపు లేనివాడు. అందుకే ముందు భగవంతుడి తర్వాతే మనంగా జీవించాలి. అర్జునుడికి కృష్ణుడిపట్ల ఉన్న ప్రేమ, గౌరవం మనకూ ఉంటే మన జీవితానికికూడా సారథి కృష్ణుడే.

మానవుడు ఏ వృత్తిచేసినా సుఖం కోసమే. శాస్త్రం చెప్పింది వాడి బుర్రకు ఎక్కదు. వాడికి అనుభవం అయ్యేవరకూ ఒక విషయమును వదలి ఇంకో విషయమును పట్టుకుంటూ ఉంటాడు. కొంతమందికి వాళ్ళకు తట్టదు ఎవరైనా చెపితే వినరు. కొంతమంది వాళ్ళకు తట్టకపోయినా పెద్దలు చెప్పింది వింటారు. వయోవృద్ధులు చెప్పింది వినాలి, కారణం వారు జీవితానుభవంతో చెపుతారు. అందుకే వశిష్టుడు చెప్పింది విని దశరథుడు లోకకళ్యాణం కోసం రాక్షససంహారం చేయుటకు శ్రీరాముడిని విశ్వామిత్రుడి వెంట పంపిస్తాడు. హృదయంలోనికి వెళ్ళటం సామాన్యముకాదు. ఎంతో తపోబలం కావాలి. శాంతి స్థానం నీ హృదయంలోనే ఉంది, అయితే ఆత్మజ్ఞాన సముపార్జనకు నీ బుద్ధి అనే దీపం సహాయంతో ముందుకు నడు అన్నాడు బుద్ధుడు. భగవంతుడు బాహ్యప్రక్రియలు చూడడు. మీ హృదయంలో ఏమిఉంది అని చూస్తాడు కాని మీ చేష్టలకు మోసపోడు. మీరు ఎంతో మంచివారని మీరు అనుకోవచ్చు. భగవంతుడు ఎంతోకొంత పరీక్షకు గురి చేయకుండా మీకు జ్ఞానం ఇవ్వడు.

సాధనలో ఎవరు విజయం పొందుతారంటే బైటప్రపంచాన్ని, లోపలప్రపంచాన్ని జయించినవాడు విజయం పొందుతాడు. అయితే పొందవలసిన దానిని పొందాలి అంటే తొలగించుకోవలసినవి తొలగించుకోవాలి అనే తపనతో సాధన చేసేవాడే బైట ప్రపంచాన్ని లోపలప్రపంచాన్ని జయించగలడు. భక్తుడికి బైట ఆధారాలు అక్కరలేదు. బైట ఆదారాలమీద జీవించేవాడు భగవంతుడికి భక్తుడు కాదు, సైతాన్‌కి భక్తుడు. వ్యాసమహర్షి ఏమన్నారంటే వయస్సు పెరిగేకొద్ది సహజంగా సౌందర్యం ఎలా తగ్గిపోతుందో అదేవిధంగా కోరిక పెరిగేకొద్ది బుద్ధి సూక్ష్మతను చంపేసి సిగ్గుకూడా నశించిపోతుంది. అసూయ పెరిగేకొద్ది ధర్మాధర్మ విచక్షణ నశిస్తుంది. గర్వం పెరిగేకొద్ది అన్నిరంగాల్లో పతనం అయి యోగబ్రష్టుడవు అవుతావు అన్నారు.

మనం అంతా ఆత్మే కదా! మరి యోగం ఎందుకు? అంటే పతాంజలి మహర్షి ఏమన్నారంటే యోగః చిత్తవృత్తి నిరోధః అన్నారు. కారణం మీ మనస్సును బాహ్యముఖపరచి, మీ స్వరూపానికి దూరం చేసే తలంపులను నిరోధించటమే యోగంయొక్క లక్ష్యం. పెళ్ళి అయిన కొత్తలో అత్తగారు తిట్టినమాట జ్ఞాపకంవస్తే, ఆవిడకు వేద్దాము అనుకున్న మామిడిపండు వేయటము మానేస్తాము. జరిగిపోయిన సంఘటన చిత్తవృత్తి రూపంలో వచ్చింది. ఆ వృత్తిని నిరోధించటమే యోగము. ఆ చిత్తవృత్తిని నిరోధించకపోతే మనస్సుకు తూకం పెరగదు. తూకంలేకుండా హృదయాంతరాళంలోనికి వెళ్ళలేవు. అహంకారంకూడా ఒక తలంపే. ఆ తలంపును తృప్తిపరచకుండా నిరోధించగలిగితే మానసిక ఆరోగ్యం కుదుటపడి, శారీరక ఆరోగ్యంకూడా బాగుంటుంది. మనోప్రవాహానికి ఎదురు ఈదితే మనోమూలంలోనికి వెళ్ళగలం, అక్కడే ఈశ్వరుడు ఉన్నాడు, ఆయన స్వరూపమే సుఖం, శాంతి.

అతిగా స్నేహాలు బంధిస్తాయి. అదేవిధంగా కొన్ని తలంపులు బాగా పీడిస్తాయి. పాములు, తేళ్ళు బాధ కలిగిస్తాయి అని తెలిస్తే పట్టుకుంటారా? మీ శరీరంమీద కండచీమలు పాకుతూఉంటే ఉంచుకుంటారా? దులిపేస్తారు. అలాగే బాధకలిగించి, పీడించే చెడుతలంపులనుకూడా వదిలేయమంటున్నారు. తెలియక ఇంతకాలం పట్టుకున్నారు. అవి బాధించి పీడిస్తున్నాయి అని అర్థం అయ్యాకకూడా పట్టుకుంటారు ఎందుకు? వదిలేయండి అన్నారు పుట్టపర్తి బాబా. సుఖం అనేది హృదయంలోనే ఉంది, బైట ఎక్కడా లేదు అని నీకు ధృడ విశ్వాసము కలిగేవరకూ తలంపులను విడిచిపెట్టలేవు. తలంపులు విడిచిపెట్టిన మనస్సు మాత్రమే హృదయాభిముఖంగా ప్రయాణం చేస్తుంది.

ప్రతి నామానికి శక్తిఉంది. ఆ నామం మీ మనస్సును నిరోధించి మిమ్మల్ని పరమపవిత్రుల్ని చేస్తుంది. ఏ రూపమైనా బేధంలేదు, అయితే మీ మనస్సు అక్కడ నిలబడాలి. నిరంతరం,

జీవితం పొడవునా, చివరి శ్వాసవరకూ, మీలోపలఉన్న దోషాలు అన్నీ నశించేవరకూ నామం జపించటం వలన ఆజపం ధ్యానస్థితికి దారితీసి హృదయంయొక్క లోతులకు తీసుకువెడుతుంది. అప్పుడు తెలుస్తుంది ఇంతకాలం మనది సహజస్థితే అయినప్పటికి అసహజస్థితిలో ఉన్నాము అని. మన హృదయంలోని ఆత్మ నిరంతరం జపిస్తుందని అప్పుడు అర్థం అవుతుంది. ఆత్మే గొప్ప మంత్రం. అది లోపల నిరంతరం జపం చేస్తూనే ఉంటుంది. ఆ జపాన్ని గ్రహిస్తే ఈ జపాలుతోటి పనిలేదు. ఆ సహజజపం అందేవరకూ ఏదోఒకరూపమును ఆరాధించి ఆ నామమును జపించాలి. నామమును చేయగా, చేయగా ద్వైతప్రపంచంతో సంబంధం తెగి అద్వైతానికి దారిచూపిస్తుంది, హృదయంలోని జపం అందుతుంది అదే నామసిద్ధాంతము. ఆ జపం అందేవరకూ ప్రయత్నం చెయ్యి. అక్కడకు వెళ్ళాక ప్రయత్నం చేసేవాడు జారిపోతాడు. ఇప్పడు ప్రయత్నం చేయకుండా ఉండలేరు. అప్పడు ప్రయత్నం చేద్దాము అంటే చేసేవాడు ఉండడు. జపం ఎవరు చేస్తారు? మనస్సే చేస్తుంది. ఆ మనస్సే హృదయంలో ఐక్యం అయినప్పడు ఇంక ఎవరు జపం చేస్తారు.

భగవాన్‌ను మీరు ఎప్పడూ బైటే ఉంటారు లోపలకు వెళ్ళి జపమో, ధ్యానమో చేసుకోరాదా అంటే, బైట ఉన్నవాడు లోపలకు వెళ్తాడు, లోపలున్నవాడు బైటకువస్తాడు. దేహాభిమానం ఉన్నవాడికి లోపలా, బైటా. దేహంలోపల నేను ఉన్నాను, దేహంబైట లోకం ఉంది అని ఆత్మ అనుకోదు. జీవుడే అనుకుంటాడు. ఆత్మకు అంతా తానే. ఇంక లోపలా, బైటా ఏమిటి? నాకు బైట ఉంటే కదా! లోపలకు వెళ్ళటానికి అన్నారు భగవాన్. అహంకారం నశించాక అంతటా తానే. నరకంకూడా స్వర్గమే. దేవతలకు, త్రిమూర్తులకు, యమధర్మరాజుకుకూడా అసూయ కలుగుతుంది మనల్నిచూస్తే అది ఆత్మానుభవ వైభవము. మనకు నేను అనగానే లోపలే ఉన్నామనిపిస్తుంది కాని బైట ఉన్నామని అనుకోము. మన అస్థిత్వాన్ని దేహానికే పరిమితం చేసుకుని ఈ దేహమే నేను, దేహమే ఆత్మ, దేహమే సర్వస్వము అనే మూలతలంపుమీదే ఆధారపడి జీవించటంవల్ల బైటలేము అనిపిస్తుంది. ఆ మూలతలంపే అహంకారము. అదే బుద్ధుడు చెప్పింది నీ బుద్ధి అనే దీపాన్ని పట్టుకుని దాని చేష్టలుచూడు అన్నారు. ఎందుచేతనంటే ఆ మూలతలంపు మూలంలోనే ఈశ్వరుడు ఉన్నాడు. ఆ చైతన్యప్రవాహంలో కలసిపోతే నీకు ప్రయత్నంతో పనిలేదు, కారణం ఆత్మ అప్రయత్నంగానే ఉంటుంది. అక్కడ ఉండగలిగితే యుగాలు క్షణాలు కింద ఉంటాయి. ఆ సహజస్థితి రావాలంటే నీ మనస్సుని కాదు, ఈశ్వరుని వాక్యం ప్రమాణంగా జీవించు. సత్వగుణాన్ని అభ్యసిస్తూ ఏక్షన్ పెంచుకుంటూ, రియాక్షన్ తగ్గించుకుంటూ, ఈశ్వరానుభవం పొందటానికి నువ్వుచేసే పని నిజమైన పని. మిగతాది అంతా పనేకాదు. అందుచేత పని విడిచిపెట్టవద్దు. పనిలోఉన్న కర్తృత్వాన్ని

విడిచిపెట్టు. ఏదైనా పని నీద్వారా అయినా సంకల్పం ఆయనది, పరికరాలు ఆయనవి, శక్తి ఆయనది, చేసింది ఆయన, ఆ పనిఅంతా నారాయణుడే. నువ్వు ఎక్కడ ఉన్నావు? చేసినపని గుర్తుచేసేది అహంకారము, కారణం దానికి అదే ఆహారము. అలా చేసినపని మర్చిపోకుండా గుర్తుచేసుకుంటూ తలమీద మోస్తూఉంటే అహంకారం పెరిగిపోయి ఆత్మవైపు ప్రయాణించనివ్వదు, ఎందుచేతనంటే దాని అస్థిత్వం పోతుందని. ఏదైనా ఒకపనిచేస్తే లోకానికి, మీకు ఉపయోగపడుతూ అదేపని మీ మోక్షసముపార్జనకు సహకరిస్తే అది నిజమైనపని అన్నారు వివేకానంద. అందుచేత దేహయాత్రకు సరిపడ పనిచేసుకుంటూ మిగతా సమయంఅంతా ఈశ్వరునికోసం జీవించి, ఆయనను పొందటానికి ప్రయత్నం చేయాలి. మన అజ్ఞానమును వ్యాపింపచేయుటమే మనపని. మనపేరు అంతటా వ్యాపించిపోవాలి అనే గొడవేకాని మనకు జ్ఞానంగొడవలేదు. శ్రీరాముడు పర్ణశాలలో లక్ష్మణుడితో ఎక్కడ నివాసయోగ్యంగా ఉంటుందో ఆలోచించి ఒక కుటీరము నిర్మించు అంటాడు. మీరుఇలా చేయమంటే చేస్తాను. కాని ఆలోచించి నీకు తోచినవిధంగా చేయమని చెప్పి, అప్పుడే నన్ను అంతపెద్దవాడిని చేయకండి అంటాడు లక్ష్మణుడు. అది బుద్ధిమంతుడి లక్షణం, అదే శరణాగతి. జీవలక్షణాలు పెట్టుకుని స్వతంత్రుడిని అయ్యాను అనుకుంటే ఎందుకూకాకుండా పోతారు ఎవరైనా. మానవరూపంలోఉన్న ఈ సర్వాలకా ఆత్మజ్ఞానం అన్నాడు యేసు. ఈశ్వర సంకల్పాన్ని గౌరవించి తీరాలి, మనకు ఎన్ని Ph.D.లు ఉన్నా ఈశ్వరసంకల్పాన్ని గౌరవించేబుద్ధి లేకుండా, ఆయన పాదాలు ఆశ్రయించకుండా పవిత్రులంకాలేము, మనస్సు అణగదు, ఈశ్వరుని స్వరూపం వ్యక్తంకాదు.

భగవాన్ జీవితం అమృతమయము, భగవాన్ కుడిచేతికి క్యాన్సర్‌వ్యాధి వచ్చింది. వైద్యులు ఎంత ప్రయత్నించినా తగ్గించలేకపోయారు. అప్పుడు డాక్టర్స్ భగవాన్‌తో అంటారు ఈ క్యాన్సర్‌వ్యాధి తగ్గించటం మావల్లకాలేదు. మీరు ఒక్కసారి ఈ క్యాన్సర్‌వ్యాధి తగ్గిపోవాలని స్మరించండి తగ్గిపోతుంది అన్నారు. భగవాన్‌కు ప్రత్యేక సంకల్పంఅంటూ ఏమిలేదు. ఈశ్వరసంకల్పమే ఆయన సంకల్పము. నాకు ఒకదేహం ఉందని, దానికి రెండుచేతులు ఉన్నాయని, అందులో ఒకచేతికి క్యాన్సర్‌వచ్చిందని అనుకునేవాడు ఉంటే, అనుకోకుండా ఎలా ఉంటాను? మీరు చెప్పకుండానే, వాడే తగ్గిపోవాలని అనుకునేవాడు. మరి అనుకునేవాడు లేడే, వాడు ఎప్పడో నశించిపోయాడు. అయితే ఇక్కడ ఉన్నవాడు ఎవరు? అని మీరు అడగవచ్చు. ఇక్కడ ఉన్నవాడిగురించి మీకుచెప్పినా ఇప్పుడు మీకు అర్థంకాదు అన్నారు భగవాన్. ఈశ్వర సంకల్పాన్ని గౌరవించేవాడే భక్తుడు, యోగి అవుతాడు.

ఒకసారి మాట ఇచ్చామంటే ఎవరికైనా చివరివరకూ పోషించుకోవాలి. ఇచ్చినమాట

పోషించుకోవటంకూడా ధర్మాచరణలోకి వస్తుంది. శంకరాచార్యులవారు నా తల్లికి నేను ఏమి సేవచేయలేదు కాని ఆవిడ దేహం విడిచిపెట్టే సమయంలో నీ సమక్షంలో ఉంటానని ఒకేమాట ఇచ్చాను. ఆ మాట పోషించుకోటానికి ధర్మాధర్మ విచక్షణ తీసుకురాక, నా తల్లి దహనసంస్కారములు చేయనివ్వండి అన్నారు గ్రామస్తులతో. అదేవిధంగా రావణాసురుడ్ని వధించిన తరువాత అతని ఐశ్వర్యంచూసి లక్ష్మణుడు ఈ ఐశ్వర్యం అంతటికి మన అయోధ్య సరిపోదేమో అంటాడు. ఎంత ఐశ్వర్యంఉన్నా భరతుడికి ఇచ్చిన మాటప్రకారం అయోధ్య వెళ్ళటం మన ధర్మం అంటాడు శ్రీరాముడు. ధర్మోరక్షతి రక్షితః, కించిత్తు ధర్మాన్ని ఆచరించినా ఆ ధర్మం మరణానంతరం చీకటిలోకాలకు వెళ్ళకుండా కాపాడుతుంది. ధర్మాన్ని ఎవరైతే ఆచరిస్తున్నారో వారిని ఎవరైనా పాడుచేయాలని చూసినా ధర్మస్వరూపమైన ఈశ్వరుడు ధర్మాన్ని ఆచరించేవారిని సర్వావస్థలలో రక్షిస్తూనే ఉంటాడు. దుర్యోధనుడు ధర్మరాజును పట్టి బంధించి నా పాదాలచెంత పడేయమని ద్రోణాచార్యులవారిని వరం కోరుకుంటాడు. ద్రోణాచార్యుడు బంధించి అప్పగిస్తానని మాట ఇస్తాడు దుర్యోధనుడికి. కాని యుద్ధరంగంలో ప్రవేశించాక తెలిసింది ద్రోణాచార్యునికి, మాటఅయితే సులభంగా ఇచ్చానుకాని కృష్ణార్జునులు ఉన్నంతకాలం అది సాధ్యంకాదని దుర్యోధనుడితో చెపుతాడు ద్రోణాచార్యుడు.

అన్ని భయాల్లోకి పెద్దభయం మరణభయం. కారణం మన మరణానంతరంకూడా ప్రయాణం ఉంటుంది. అయితే ఆ ప్రయాణంయొక్క గమ్యం మనకు తెలియదు. అందుకే మరణం అంటే భయం కలుగుతుంది. మరణం అనేది శత్రువుకాదు మిత్రుడే. మరణం జీవితంలో ఒకభాగం మాత్రమే. అంచేత మరణంఅంటే భయపడకూడదు. మరణంఅంటే ఏమిలేదు శరీరాలను మారుస్తుంది, సాధన చేసుకోవటానికి మంచి అవకాశాలను కల్పిస్తుంది. ఒక్క బలహీనతచాలు పతనం అవ్వటానికి. ధర్మరాజు ధర్మాన్ని ఆచరించేవాడే అయినప్పటికీ జూదంఆడే ఒక్క బలహీనతవల్ల రాజ్యాన్ని కోల్పోయాడు. అదేవిధంగా మనస్సు బాహ్యముఖమై పునర్జన్మను తీసుకురావటానికి ఒక్క వాసనచాలు. జపం చేయటంవల్ల పునర్జన్మకు కారణమయ్యే వాసన నశిస్తుంది.

# జగత్తు జగత్తుగా నిజం కాదు, జగత్తు బ్రహ్మంగా నిజం

సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 24-6-2001, జిన్నూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

శ్రద్ధగా సాధనచేసుకుని ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి వచ్చేవారికి జగత్తు మిధ్య, మాయే, నిజంకాదు అని చెప్పాలి అన్నారు భగవాన్. కారణం జగత్తు నిజంవలే కనిపిస్తున్నంతకాలం మనస్సు బాహ్యముఖం అవుతూనే ఉంటుంది. మనస్సు అణగటంవేరు, నశించటంవేరు. అణిగిన మనస్సు ప్రకోపించే అవకాశం ఉంది. మనస్సు అణిగి, నశిస్తేకాని ఆత్మజ్ఞానం అనుభవంలోనికి రాదు. బ్రహ్మమూ జగత్తూ రెండూ నిజమే, ఎలా నిజమంటే జగత్తు, జగత్తుగా నిజంకాదు. జగత్తు బ్రహ్మంగా నిజము. జగత్తును, జగత్తుగాచూస్తే మనస్సు దానివెంట పడుతుంది కాబట్టి జగత్తు నిజంకాదని అనుకో అంటున్నారు భగవాన్. బ్రహ్మం సత్యం, జగత్తు మిధ్య. జగత్తుకుడా బ్రహ్మంగా సత్యం. మనల్ని మనం చూసుకుని లోకాన్నిచూస్తే లోకంకూడా బ్రహ్మంగానే కనిపిస్తుంది. లోకముఅంటే రూపము, నామము, క్రియ. ఒక ప్రత్యేకమైన రూపంతోకాని, ఒక ప్రత్యేకమైన నామంతోకాని, ఒక ప్రత్యేకమైన గుణంతోకాని తాదాప్యం చెందకుండాఉంటే లోకం బంధించదు. మానవుడికి ఆనందం కావాలి, ఆనందం లోకంలో లేదు, ఆనందం మన హృదయంలోనే ఉంది. అదే బ్రహ్మము. బ్రహ్మానుభవం వచ్చినవాడికి ఎటుచూసినా ఆనందమే. ఆనందానుభూతి పొందినవాడికి లోకం తనలోనే కలసిపోతుంది. బ్రహ్మంను తప్పించి మనం ఏదిసాధించాలనుకున్నా, ఏది అవ్వాలి అనుకున్నా అక్కడ సుఖంలేదు, శాంతిలేదు, స్వేచ్ఛలేదు. బ్రహ్మమునకు ఇతరులు లేరు అందువలన బ్రహ్మంలో భయంలేదు. బ్రహ్మమే అభయస్థితి. మనస్సును దేహమును ఉపయోగించుకుని బ్రహ్మజ్ఞానము పొందాలి. మాయ మనోరూపంలో ఉంటుంది. మనస్సులో ఉన్నదే లోకంలో కనిపిస్తుంది, మనస్సు అణిగిపోతే లోకంకూడా అణిగిపోతుంది. మనోకల్పితమునుండి విడుదల పొందినప్పుడు ఉన్న సద్వస్తువు ఉన్నట్లుగా వ్యక్తం అవుతుంది. మన హృదయంలోఉన్న సత్యం ఒకటిగానే ఉందికాని, రెండుగాను, మూడుగాను ఉండదు. ద్వైతం దుఃఖం, అద్వైతం సుఖం అయితే అద్వైతం అనుభవానికి సంబంధించినది.

భగవద్గీతలో ఈశ్వరుడు ఆయన పాదాల్ని అంటిపెట్టుకుని ఉండమని, ఆయనను ప్రేమించమని, ఆయనను ధ్యానించమని, ఆయన చెప్పిన పనులు చేయమని ఇటువంటి

బంగారు మాటలు ఎన్నో ఉపదేశించారు. ఈ విధంగా దేహంమీద అభిమానంను తగ్గించుకుని ఆయనను అభిమానించటంవల్ల లోకంతోఉన్న అనుబంధానికి దూరం అవుతామని ఈశ్వరుడిమీద మనస్సును ఉంచటంవలన పునర్జన్మ కారణాలు నశిస్తాయి. మనస్సును ఈశ్వరమయం చేసినప్పుడు దేహంఉన్నా, లేకపోయినా లోకం కనిపించినా, కనిపించకపోయినా అంతా ఒకటిగానే ఉంటుంది. ఆనందమే ఆనందము. ఎంతోకొంత మంచిలేకుండా మానవజన్మ రాదు. ఇతరులలోఉన్న మంచిని చూచుటకు మనం అలవాటుపడితే మనలోఉన్న మంచిపెరుగుతుంది. ఈ లోకంలో అనేక శిక్షణలు ఉన్నాయి, కాని అన్ని శిక్షణలకంటే మనస్సుకు శిక్షణ ఇవ్వటం ముఖ్యాతి ముఖ్యం. అందుకే మనం ఈ లోకంలోకి వచ్చాము. శిక్షణ లేకుండా మారుమనస్సురాదు, మనలో మంచి పెరగదు. ఇతరుల గురించి ఆలోచించటం వలన మన మనస్సు విశాలం అవుతుంది. నిరంతరం మనగురించి మనం ఆలోచించుకోవటం వలన మనస్సు ఇరుకు అవుతుంది. స్వార్థం పెరిగి అన్ని కాంక్షలు మనల్ని వెంటాడతాయి. పెద్దమనస్సు ఉన్నవాడికి సుఖం స్వరూపంగా వ్యక్తం అవుతుంది. అతను సుఖంకోసం తలంపులమీదకాని, వస్తువులమీదకాని ఆధారపడవలసిన పనిలేదు. నిజమైన సుఖికి ఈ లోకంలో వినటానికికాని, చూడటానికికాని, గ్రహించటానికికాని ఏమీలేదు.

మనిషికి, మనిషికి మధ్య బేధాలు కల్పించేవారితో స్నేహం చేయకూడదు. వారిని చూచినా దోషమే అని వ్యాసభగవానుడు అన్నారు. తలంపులో, మాటలో, చేతలో బహుజాగ్రత్త అవసరము. మనం మాట్లాడే మాటలు ఎక్కడకు దారితీస్తాయో తెలియకుండా మాట్లాడకూడదు. ఏమీ తెలియకపోయినా అన్నీమాకు తెలుసును అని భావించేవారే ఎక్కువమంది రాజకీయాల్లో ప్రవేశిస్తున్నారని ఆంగ్లరచయిత జార్జిబెర్నార్డ్ షా అన్నారు. క్రియకు ప్రతిక్రియ ఉంటుంది. అందువలన నాలుగుసార్లు ఆలోచించికాని ఒక పనిచేయకూడదు. మనకు తెలియని పనిని ఇతరులనుండి నేర్చుకోవటానికి మన అహంభావన అడ్డురాకూడదు.

ఈశ్వరుడు కర్మసాక్షి సర్వజ్ఞుడు. కళ్ళులేకుండా చూడగలడు, కాళ్ళులేకుండా నడవగలడు, చేతులులేకుండా పనిచేయగలడు, ఆయన మన హృదయంలోనే ఉన్నాడు. అన్నీచూస్తూ ఉన్నాడు. ఎవరి దేహప్రారబ్ధమును అనుసరించివారిని ఆడిస్తూ ఉన్నాడు. మనం చేసే ప్రతిపనికి ఆయనకు జవాబు చెప్పకోవాలి. దేహాభిమానంతో పనిచేస్తే మంచికి మంచి, చెడుకి చెడు ఎత్తుకు ఎత్తు అనుభవించాలి. దేహాభిమానం లేనివాడు చేసినా చేయనివాడితో సమానము. కర్తలేని కర్మ బంధించదు. కర్తృత్వం లేకుండా మూడులోకములనూ దహించినా దోషమురాదు

అని అర్జునుడికి భగవంతుడు ఉపదేశించాడు. ఈశ్వరుడు కరుణామయుడు ఆయనకు శరణాగతి చేసినవాడికి కర్తృత్వం నశిస్తుంది, తన హృదయంలో ఉన్న చైతన్యం ఎరుకలోనికి వస్తుంది. ఎక్కడ ఏది జరిగినా ఆయనకు తెలియకుండా జరగదు. కారణం అందరిలోనూ అంతర్యామిగా ఉన్నది ఆయనే. సాధకుడి బుద్ధిని పవిత్రం చేయుటకు అవసరం అయితే బాధలను పంపిస్తాడు. సాధకుడు ఆ బాధలను ఈశ్వర ప్రసాదంగా అనుభవిస్తే బుద్ధిలోని దోషములు పోయి బుద్ధికి ఏకాగ్రత కలిగి భగవదనుభవం పొందుటకు సిద్ధముగా ఉంటుంది. దేహాభిమానం ఉన్నవాడికి కర్మానుభవం ఉంటుంది. దేహాభిమానం లేనివాడికి కర్మానుభవం ఉండదు. కర్తృత్వం లేనివాడికి కర్మానుభవంతో సంబంధం ఉండదు. బ్రహ్మం ఎంత పవిత్రంగా ఉంటుందో సాధకుని మనస్సు అంత పవిత్రం అయ్యేవరకూ దేహాభిమానం విడిచిపెట్టదు, కర్మఫలం వెంటాడుతూనే ఉంటుంది. మానవుడు తాను ఆత్మే అయ్యినప్పటికీ తాను దేహాన్ని అని అనుకోవటం బుద్ధిలోని దోషం మాత్రమే, ఆ దోషం నశిస్తేనేకాని దేహాన్ని నేను అనుకునే బుద్ధి నశించదు. దేహబుద్ధి నశించకుండా ఆత్మబుద్ధి ఉదయించదు. ఈశ్వరానుగ్రహం సంపాదించుకుని శవబుద్ధిని తొలగించుకోవాలి. ఈశ్వరుడు భక్తుడిని అనుగ్రహించటానికే బాధలను పంపిస్తాడు. ఈ విషయం గ్రహించినవాడు ధన్యుడు. యమునా నదిలో కాళీయ సర్పం నివసించే మడుగులోనికి కృష్ణస్వామి ఉరికారు. కాళీయుడ్ని చంపటానికి కాదు అనుగ్రహించటానికి మాత్రమే.

నోటితోటి ఏది మాట్లాడినా, మనస్సుతోటి ఏది ఊహించినా అది నిజంకాదు. హృదయంలోఉన్న నిజాన్ని మాటలు, ఊహలు అందుకోలేవు. హృదయంలోఉన్న నిజం తప్పించి మిగతావి అన్నీ మనోకల్పితములు. హృదయంలోని సత్యం అనుభవించేదేకాని ఊహించేదికాదు, మాట్లాడేదికాదు. నిజం మనస్సుకు అందదు. నిశ్శేషంగా మనస్సు అణిగి, నశిస్తే అక్కడ నిజం తానుగా వ్యక్తం అవుతుంది.

కారణం లేకుండా కార్యము ఉండదు. జ్వరకారణము లేకుండా జ్వరంరాదు. జ్వరం జబ్బుకాదు, జ్వర కారణం జబ్బు. కారణం తొలగకుండా కార్యం నశించదు. దుఃఖము జబ్బుకాదు. దుఃఖకారణము జబ్బు. తానుకాని మనోదేహములతో తాదాత్మ్యం పొందటం వలన దుఃఖం వెంటాడుతూ ఉంటుంది. దేహాత్మబుద్ధే దుఃఖానికి కారణము. దుఃఖకారణము నశించేవరకూ దుఃఖము వస్తూనే ఉంటుంది. అహంకారంనుండి నివృత్తి పొందినవాడికి మానసిక, శారీరక, లోకతాపములు అంటవు. బోధించే విషయము లేనప్పుడు నోరు

మెదపకూడదు. అహంకారమునే కేంద్రముగా పెట్టుకుని వచ్చేతలంపులు, మాటలు గృహములోను, సమాజములోనూ ఎన్నో కలహములకు, జగడములకు, యుద్ధములకు దారితీస్తాయి. నోరుజారే అలవాటు వున్నవాళ్ళకు మృత్యువుకూడా తొందరగా వచ్చే అవకాశము ఉంది. ఇతరులు మనపట్ల ఎలా మాట్లాడాలని అనుకుంటున్నామో మనంకూడా ఇతరులపట్ల అలాగే మాట్లాడాలి. మాట మరణం తీసుకువచ్చేదిగా ఉండకూడదు. సౌమ్యంగా మాట్లాడేవాడు అమరుడు అవుతాడు. దేహంతో తాదాప్యంపొందే మొదటి తలంపునే మిధ్యానేనని అంటారు. ఈ మిధ్యా నేనునుండి విడుదల పొందుటకు తగిన యోగ్యత, అర్హత మనకు లేనప్పడు ఎంత శాస్త్ర పాండిత్యంఉన్నా సత్యమైన నేను అవగాహనలోనికి రాదు. సత్యమైన నేనే పరబ్రహ్మము, దానికి ఇతరులు లేరు, అదే అంతటా ఉన్నది. అదే నారాయణుడు. కాలదేశములకు ఆ సత్యం అతీతము.

జనన మరణములు పారమార్థికముగా నిజముకాదు. దేహము ఎంత నిజమో, లోకము ఎంత నిజమో అవికూడా అంతే నిజము. అజ్ఞానమనే దీర్ఘనిద్రలో జరిగే సంఘటనలే ఈ జనన మరణములు. జీవితములో అనేక సంఘటనలు జరుగుతూ ఉంటాయి. అందులో జరిగే చివరి సంఘటనే శరీరానికివచ్చే మరణము. ఆ మరణముకూడా తలంపు మాత్రమే. తలంపులులేని పరబ్రహ్మమును అందుకునేవరకూ తలంపులు వస్తాయి. తలంపులను త్యజించలేనివాడు రాగద్వేషములకు, పుణ్యపాపములకు అతీతంగా ఉండలేడు. మూలతలంపు మూలములోనే బ్రహ్మము ఉన్నది. దానిని పొందినవాడికి మాత్రమే అమృతానుభవం కలగుతుంది. అమృతానుభవం అనుభవంలోనికి వచ్చినప్పడు ఈ జన్మలు అన్నీ అజ్ఞానమనే నిద్రలో వచ్చిన స్వప్నదేహములు అని అర్థం అవుతుంది. అజ్ఞానములనే చీకటిని తొలగించుకోవటానికి సహకరించేవాడే గురువు. నీవు లోపల ఎవరిగా ఉన్నావో ఆ నిజతత్వమును మరచిపోయావు ఎన్నో యుగాలుగా. దాని తాలుకు స్మృతిని కలుగచేసేవాడే గురువు. ఆ ఆత్మ నువ్వేకాని మరచిపోయిన ఆ స్మృతిని తీసుకువచ్చేవాడు గురువు. మన హృదయంలో నిజమైన నేను ఉంది, ఆ నిజమైన నేను ఎప్పడూ బాధపెట్టదు. మనకు ఏదైతే నేను అని వ్యక్తం అవుతోందో అది నిజంకాదు, అందుకే బాధపెడుతుంది. ఆ మిధ్యా నేనులోంచి విడుదల పొందటమే నిజమైన స్వాతంత్ర్యము. మిధ్యా నేనును తొలగించుకొనుటకు భగవంతుడు భగవద్గీతలో నాలుగు మార్గములను చెప్పారు. అవే భక్తి, ధ్యాన, కర్మ, జ్ఞానయోగములు. నీ ప్రవృత్తిని బట్టి నీకు ఏ యోగం ఇష్టం అయితే ఆ మార్గంలో ప్రయాణంచేసి

మిథ్యా నేనునుండి విడుదల పొందాలి. మిథ్యానేనును అలంకరించటం యోగంకాదు, మిథ్యా నేనునుంచి విడుదల పొందటం యోగం. తనకంటూ ఏదో ప్రత్యేకతను సాధించాలనుకొనేవాడు యోగికాలేడు కోరికలతో పనిచేసేవాడు కోరికలులేని నిర్వాణస్థితిని పొందలేడు. ఆస్థితికతను పోషించుకోవాలి. అనాత్మవాదమునకు దూరంగా ఉండాలి. సద్బుద్ధిని కాపాడుకోవాలి. అన్నివిధములా ప్రయత్నముచేసి దుర్బుద్ధి ఉన్నవారితో సహవాసం చేయకూడదు. బుద్ధిబలము అవసరము. బాహ్యంగా పరిస్థితులు మనకు అనుకూలంగా లేకపోయినా బుద్ధిబలముతో సంతోషమును, శాంతిని కాపాడుకోవచ్చును. ఈశ్వరుడి పాదాలను ధ్యానించి, పవిత్రబుద్ధిని పెంచుకోవాలి. పరమ పవిత్రుడుకానివాడు ఆధ్యాత్మిక శిఖరమును అందుకోలేడు. అనుకూలమైన సతి, నచ్చిన ఉద్యోగం లేకపోయినా సౌమ్యుడిని సుఖం అంటిపెట్టుకుని ఉంటుంది. దేహంకూడా నీడ ఉన్నట్లు, సౌమ్యస్థితి పొందినవాడివెంట నమ్రత ఉంటుంది.

హృదయంలో ఈశ్వరుడు ఉన్నాడు, ఆయన నామమును జపించి, ఆయన పాదములను ధ్యానించి, ఆయన అనుగ్రహమును సంపాదించవలెను. ఆయన అనుగ్రహం లేకుండా ఆయన తెలియబడడు. ఆయన అనుగ్రహమునకు అసాధ్యములంటూ ఏమీలేదు. సాధనవల్ల అన్నీ సిద్ధిస్తాయి. బద్ధకస్తుడు సాధన చేయలేడు. బుద్ధిని బాగుచేసేది భక్తి, బుద్ధిలోని మలినములను తొలగించేది భక్తి. ఏ పనైనా శ్రద్ధ, విశ్వాసములతో చేయుటకు భక్తి అవసరము. జీవితానికి మాధుర్యము చేకూర్చేది భక్తి. భక్తిలేని జ్ఞానము పంచదారలేని కాఫీలా ఉంటుంది. భక్తి తల్లిఅని, జ్ఞానం బిడ్డఅని, భక్తి లేకుండా జ్ఞానంరాదని అరుణాచల మహర్షి అన్నారు. భక్తిరుచి తెలియనివారు భక్తి మార్గంలో నిలబడలేరు. జీవుడు శరీరాన్ని విడిచిపెట్టాక శరీరం శవం అవుతుంది. శవాన్ని ఎవరూ గౌరవించరు. శవాన్నిచూసి అందరూ భయపడతారు. శవానికి తను ఉన్నానని తనకు తెలియదు. అందువలన దానిని దహించినా పోట్లాటకురాదు. దేహాన్ని విడిచిపెట్టిన తరువాత జీవుడు ప్రయాణం చేస్తాడు. వెళ్ళేవాడు, వచ్చేవాడు జీవుడు మాత్రమే. సత్యం వెళ్ళేదికాదు, వచ్చేదికాదు. పుష్పములలో ఉన్న వాసనను గాలి ఎలా మోసుకునిపోతుందో అదేవిధంగా జీవుడు తాను పెంచి పోషించుకున్న సుగుణములను, దుర్గుణములను తాను ధరించబోయే కొత్త దేహములోనికి మోసుకునిపోతుందని భగవద్గీతలో భగవంతుడు ఉపదేశించాడు. భక్తిమార్గము సులువుగా పునర్జన్మ హేతువులైన గుణములను తొలగించి గుణాతీతస్థితిని ప్రసాదిస్తుంది. గుణాతీతుడే మోక్షపదవికి అర్హుడు. బృందావనంలో గోపికలు

ఎవరినిచూసినా, ఎటుచూసినా వాళ్ళు దర్శించేది కృష్ణదేవుడిని మాత్రమే, గుణములను కాదు, ద్వంద్వభావన లేదు. ద్వంద్వమైన అర్థాలు ఇచ్చే మాటలు మాట్లాడే అలవాటు గోపికలకు లేదు. గోపికల భక్తి మనకు ఆదర్శము. అహంకారానికి కోతవంటిది భక్తి. భగవంతుడు భక్తుడిని తనలో ఐక్యం చేసుకునే వరకూ కాపాడుతునే ఉంటాడు. వైకుంఠంలో ఉన్నా మరి ఎక్కడ ఉన్నా భక్తుడి భారాన్ని ఆయనే మోస్తూ ఉంటాడు. అహంకారి తన భారాన్ని తానే మోసుకోవాలి. విసుగువచ్చేవరకూ ఈ భక్తి మార్గము గురించి శ్రవణం చేయాలి. శ్రవణం చేసినా, మననం చేయకపోతే బుద్ధికి గ్రాహ్యముకాదు. భగవంతుడిని ప్రార్థించగా, ప్రార్థించగా; ధ్యానించగా, ధ్యానించగా; స్మరించగా, స్మరించగా; ఆయన మనకు పరమార్థమును అవగాహన చేసుకునే బుద్ధిని ప్రసాదిస్తాడు. భగవంతుడి పాదాలే భక్తుడిని రక్షిస్తాయి.

**ఏది మనముగా ఉన్నామో**

**అది మనకు వ్యక్తమయ్యే వరకు**

**మనం కాని దానిని మనం అని**

**అనుకొంటూనే ఉంటాము.**

# విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు జయంతి -

## క్షత్రియ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు



క్షత్రియ సంక్షేమ పరిషత్, పాలకొల్లు వారి నేతృత్వంలో ది.4-7-2001 నాడు అల్లూరి సీతారామరాజు 105వ జయంతి ఉత్సవములు నిర్వహింపబడినవి. ఈ సందర్భముగా జాతీయోద్యమ నాయకులు శ్రీ **కలిదిండి విజయ నర్సింహరాజు** గార్ని ఘనంగా సన్మానించినారు. ఈ జయంతి ఉత్సవములు పురస్కరించుకొని 150 మంది ఆర్థికముగా వెనుకబడిన క్షత్రియ విద్యార్థులకు సుమారు 60 వేల రూపాయలు స్కాలర్‌షిప్పులు బహూకరించబడినవి. ఇందులో 20 వేల రూపాయల విలువగల బహుమతులు శ్రీ వెంకటేశ్వర చారిటబుల్ ట్రస్టు చైర్మన్ శ్రీ పి.యస్.యన్. రాజు **విశాఖపట్టణం**వారు బహూకరించిరి.


ఈ సభలో పాలకొల్లు శాసన సభ్యులు శ్రీ అల్లు వెంకట సత్యనారాయణ, మున్సిపల్ చైర్మన్ శ్రీ శిడగం పాపారావు, సద్గురు శ్రీ నాన్నగారు ఈనాటి కార్యక్రమాలయొక్క ప్రాముఖ్యతను వివరించిరి.

ఈ సంక్షేమ పరిషత్ ప్రారంభదశనుండి నేటివరకు చేపట్టిన ప్రతి కార్యక్రమానికి వారి సహకారాన్ని, ఆశీస్సులను అందజేస్తున్నందులకు సభానిర్వాహకులు **సద్గురు శ్రీ నాన్నగారికి** కృతజ్ఞతలు తెలియజేసినారు.

ఈనాటి సభకు క్షత్రియ సంక్షేమ పరిషత్ అధ్యక్షులు శ్రీ వేగేశ్న రంగరాజు అధ్యక్షత వహించిరి. సద్గురు శ్రీ నాన్నగారు జ్యోతి ప్రజ్వలన గావించిరి. సంక్షేమ కమిటి కన్వీనర్ శ్రీ దంతులూరి సత్యనారాయణరాజు అతిథులను వేదికమీదకు ఆహ్వానించి ఈనాటి సభయొక్క ప్రాముఖ్యతను వివరించిరి. ఈ సభకు విచ్చేసిన అతిథులకు క్షత్రియ సంక్షేమ పరిషత్ తరపున జ్ఞాపికలు బహూకరించబడినవి. సంక్షేమ పరిషత్ కార్యదర్శి శ్రీ పి. శ్రీరామరాజు ముగింపు సందేశం అనంతరం సభ ముగిసింది.



శ్రీ రమణాశ్రమం, తిరువన్నామలై



ఆంధ్రాశ్రమం, తిరువన్నామలై



శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు

**REGISTERED NEWS PAPER**

RNI NO. APTEL/1999/1667-POSTAL REGN.NO. AP/VJA/32/5/2000




To

**A. Lakshmi**
Plot No. 150, Rao & Raju Colony
Banjara Hills, Road No. 2
HYDERABAD - 500 034

*If undelivered please return to :*

**RAMANA BHASKARA**
SRI RAMANA KSHETRAM,
**JINNURU - 534 265.** W.G. Dt. A.P.

Editor, Printer, Publisher : **P.S. RAMA RAJU**
Lakshmi Modern Rice Mill, Ullamparru, PALAKOL - 534 260. W.G. Dt. ☎ : 08814-24589, 24689
Printed at : **SHRIRAM GRAPHICS**, Bank Street, PALAKOL - 534 260. W.G. Dt. ☎ : 22438, 24278